క్లుప్తంగా

ముఖ్యమంత్రికి సన్మానం



సీఎంను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

కందుకూరు: విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకుడు తల్లోజు సాయికుమార్‌చారి కోరారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆయన సంఘం నేతలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం సమస్యల గురించి విన్నవించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

ఎంపీడీఓ శైలజ



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న శైలజ

మహేశ్వరం: విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంపీడీఓ శైలజ అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం, వంట సామగ్రి, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. వసతిగృహ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, నిత్యం మూత్రశాలలు, పరిసరాలను శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల వార్డెన్ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కందుకూరు: మండల పరిధి తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ గానుగపేట రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి.. శుక్రవారం ఆమె మృతదేహానికి నివాళులర్పించి కుటుంబీకులను ఓదార్చారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, దేవేందర్, సురేందర్‌రెడ్డి ఉన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు వరమని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మేయర్ చిగురింత పారిజాతతో కలిసి పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ భవ్య హాస్పిటల్, గంగా ఆస్పత్రి స్వాతి రెసిడెన్సీ, ఆంధ్రకేసరినగర్ ఫీడర్ల పరిధి కాలనీల్లో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 11కేవీ ఇందిరానగర్, సిరిస్ ఫీడర్ల పరిధి కాలనీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు, 11కేవీ శివం హిల్స్, శారదానగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11.30 నుంచి 1 గంట వరకు, 11కేవీ శివపురి ఫీడర్ పరిధి కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు, 11కేవీ విజయపురి, బీరప్ప టెంపుల్ ఫీడర్ల పరిధి కాలనీల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు, 11కేవీ హైకోర్టు కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకు అంతరాయం ఉంటుందన్నారు.

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆర్ఎన్‌రెడ్డినగర్ ఫీడర్ పరిధి హనుమాన్‌నగర్, లక్ష్మీనగర్, మధురానగర్, ఆదర్శహిల్స్‌లో ఉదయం 10.30 గంటల నుంచి 11 వరకు, 11కేవీ లలితానగర్ ఫీడర్ కింద గాయత్రినగర్, వెంకటసాయి ఎన్‌క్లేవ్, దేవినగర్ కాలనీ, జిల్లెలగూడ, బండి సత్తయ్య కాలనీ, సత్యసాయినగర్, కమలా నెహ్రూనగర్, వెంకటేశ్వర కాలనీలలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు, 11కేవీ నందీహిల్స్, కేశవరెడ్డినగర్ ఫీడర్ల పరిధి ప్రశాంతిహిల్స్, కేఆర్ఆర్ హిల్స్, చైతన్యహిల్స్, టీచర్స్‌కాలనీ, డీఎల్ఆర్ఎల్ కాలనీ, శివగంగాహిల్స్, సిర్లాహిల్స్, సీతా హోమ్స్, మీర్‌పేట పోస్టాఫీసు, రాఘవేంద్ర కాలనీలలో 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

చందన చెరువు.. ఆహ్లాదం కరువు

- చెరువును కప్పేసిన గుర్రపుడెక్క
- పెరుగుతున్న దోమలు, ఈగలు
- ఆందోళన చెందుతున్న స్థానిక ప్రజలు



చందన చెరువును కప్పేసిన గుర్రపుడెక్క

మీర్‌పేట: ఆహ్లాదాన్ని పంచే చెరువు అపరిశుభ్రతతో దర్శనమిస్తోంది. చెరువుపై పూర్తిగా గుర్రపుడెక్క పరుచుకోవడంతో చెరువు కనుమరుగు అయినట్లుగా కనిపిస్తోందని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ చందన చెరువును గుర్రపుడెక్క ఆవహించింది. అసలే సీజనల్ వ్యాధుల కాలం. ఆపై చెరువును గుర్రపుడెక్క కప్పేయడంతో దోమలు, ఈగలు పెరిగి, విషజ్వరాల బారిన పడుతున్నారని వాకర్స్, స్థానికులు పేర్కొంటున్నారు. రెండు నెలలుగా గుర్రపుడెక్కను తొలగించకపోవడంతో చెరువు మొత్తం గుర్రపుడెక్కతో కనిపిస్తుందని, ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి నీరు చేరడంతో అధిక స్థాయిలో డెక్క పెరిగిపోయిందని స్థానికులు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం

చెరువు పరిరక్షణను మున్సిపల్ అధికారులు మరిచారని, ఫలితంగా గుర్రపుడెక్క పరుచుకోవడంతో పాటు.. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రతతో దర్శన మిస్తున్నాయని స్థానిక ప్రజలు తెలిపారు. గతంలో ఏటా నాలుగైదు సార్లు హెచ్ఎండీఏ నుంచి యంత్రాన్ని తీసుకొచ్చి, పక్షం రోజుల పాటు చెరువులోని గుర్రపుడెక్కను తొలగించే వారని, ప్రస్తుతం అలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. ఫలితంగా దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చికున్‌గున్యా, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్నారని, ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి త్వరితగతిన గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభించాలని ప్రాంత కాలనీల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కందుకూరు: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న ధర్నాకు.. సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి, వడ్డిస్తున్న కార్మికులకు ఏడు నెలలుగా బిల్లులు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వంలో మూడు నెలలు, ప్రస్తుత ప్రభుత్వంలో నాలుగు నెలల బకాయి ఉందని పేర్కొన్నారు. దీంతో కార్మికులు అప్పు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పెండింగ్ వేతనాలతో పాటు జీతాలు ప్రతి నెల ఐదో తేదీ లోపు చెల్లించాలని కోరారు. అనంతరం ఎంఈఓ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షుడు ప్రభావతి, కార్యదర్శి శ్రీనివాస్, గీత, మంగ, అండాలు, కలమ్మ, అశ్విని, విజయ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలకు నగదు ఇవ్వండి

మత్స్య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

కందుకూరు: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందించాలని రాష్ట్ర మత్స్య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పూలగాజుల జంగయ్య మండల అధ్యక్షుడు కాకి రాములు ముదిరాజ్ కోరారు. శుక్రవారం వారు ఈ నెల 25న ఇబ్రహీంపట్నంలో నిర్వహించనున్న మత్స్యకారుల రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. ప్రతీ మత్స్యకార సొసైటీకి రూ.10 లక్షల చొప్పున వంద శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సొసైటీలకు చేపపిల్లకు బదులుగా నగదు అందించాలని కోరారు. మత్స్యకార్మికులు పెద్ద ఎత్తున హాజరైన రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు కాకి మధుసూదన్, పిట్టల పాండుముదిరాజ్, యూత్ అధ్యక్షుడు కొర్వి సరేందర్, గొర్రెంకల యాదయ్య, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వేలంలో గణేశుడి లడ్డూల కైవసం



కందుకూరు: లడ్డూతో భక్తులు



మహేశ్వరం: లడ్డూను దక్కించుకున్న హరేందర్

కందుకూరు: మండల పరిధి గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి దెబ్బడగూడలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద నిర్వహించిన వేలం పాటలో లడ్డూను రూ.2 లక్షలకు క్లోం జంగారెడ్డి దక్కించుకున్నారు. బాచుపల్లి యువసేన యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో స్వామివారి మహాప్రసాదాన్ని రూ.51 వేలకు ఎగిరిశెట్టి నరేష్ కైవసం చేసుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గణపయ్యలను నిమజ్జనానికి తరలించారు.

మహేశ్వరంలో..

మహేశ్వరం: మండల పరిధిలోని నాగారం గ్రామంలో బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి లడ్డూను గురువారం రాత్రి ఏర్పాటు చేసిన వేలంలో అదే గ్రామానికి చెందిన హరేందర్ రూ.1,21,000లకు దక్కించుకున్నాడు. నిమజ్జనం సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి గీతాలు ఆలపించి భజనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, మాజీ ఎంపీటీసీ కుండె వెంకటేష్, మాజీ సర్పంచ్‌లు కావలి దశరథ, బండారి లావణ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లింగం ముదిరాజ్, నాగారం బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్వరం రాజేష్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కుండె కుమార్, గ్రామ పెద్దలు బి రాజు, యాదయ్య పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



గాంధీనగర్‌లో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతరెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి డివిజన్లలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం మేయర్ చిగురింత పారిజాత ప్రారంభించారు. 10వ డివిజన్ కుర్మల్‌గూడ ఇందిరానగర్ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులు, 29వ డివిజన్ వెంకటాద్రి నివాస్, గాంధీనగర్‌లో డ్రైనేజీ పనులు, గుర్రంగూడలో సీసీరోడ్ల నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆమె ప్రారంభించారు. కాలనీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పారిజాత వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భద్రమోని రోహిణి, పెద్దబావి శోభ, దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, డీఈఈ యాదయ్య, ఏఈఈ సాయిరాం, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేయండి


చేవెళ్ల: కందవాడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేయాలని శుక్రవారం చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్‌ను మాజీ ఉప సర్పంచ్, బీజేపీ జిల్లా మహిళా కార్యదర్శి గొండ్ల కావ్యగౌడ్, చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్‌లు గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందవాడతోపాటు గుండాల, లక్ష్మిగూడ, సాయిరెడ్డిగూడ, నారాయణగూడ, మల్లారెడ్డిగూడ, పలుగుట్ట, ఎర్నో కొటాల గ్రామాల్లో కలిపి దాదాపు 20వేల మంది జనాభా ఉంటుందని తెలిపారు. మండల ఆరోగ్యకేంద్రం ఆలూరులో ఉండటంతో గర్భిణులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆలూరు ఆరోగ్య కేంద్రం దూరంగా ఉండడంతో గ్రామస్తులు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి కందవాడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధి నేదునూరులో మహాలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500 వంట గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అన్ని వర్గాలకు కాంగ్రెస్ పాలనలోనే మేలుజరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పాండు రంగారెడ్డి, నాయకులు కల్యాణ్‌కార్ రూప్‌చందర్, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, నవాబ్, ఎండీ మస్తాన్ బాబా, కృష్ణనాయక్, రాములు, దర్శన్, ఆరోగ్యరెడ్డి, దేవరకొండ రాములు, నాగరాజు, భిక్షపతి, అంకగళ్ల వెంకటయ్య, రేషన్ డీలర్లు నీరటి రాంచందర్, కరుణాకర్, మల్దేవి పర్వతాలు పాల్గొన్నారు.



కాలినడకే శరణ్యం!



కాలినడకన బడికి వెళ్తున్న విద్యార్థులు

- బస్సులు లేక.. కాలి నడకనే పాఠశాలకు
- ప్రమాదం అని తెలిసినా కిక్కిరిసి ఆటోల్లో ప్రయాణం
- ఇదీ సర్కారు బడుల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారుల అగచాట్లు

మాడ్గుల: 'ప్రభుత్వ పాఠశాల్లో మీ పిల్లలను చదివించండి. అన్ని వసతులు కల్పిస్తున్నాం. నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నాం' అంటూ విద్యాసంవత్సరం ప్రారంభంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తుంటారు. ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తుంటారు. కానీ.. రవాణా సౌకర్యం గురించి పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రంలోని బడికి వెళ్లాలంటే సరైన బస్సు సౌకర్యం లేక తమ పిల్లలను ప్రైవేటు బడిబాట పట్టిస్తున్నామని పేర్కొంటున్నారు. ఆర్థిక భారం అయినా.. ఇంటి ముందుకే బడి బస్సు వస్తుండటంతో ప్రైవేటు పాఠశాలలకు చిన్నారులను పంపిస్తున్నట్లు వెల్లడిస్తున్నారు.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

సర్కారు బడుల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు బడి వేళల్లో తగినన్ని ఆర్టీసీ బస్సులు లేక పోవడంతో తరగతులకు హాజరు కాలేకపోతున్నారు. ఫలితంగా ముందుగా జరిగే పాఠాలను వినలేకపోతున్నారు. సమయానికి ఆర్టీసీ సర్వీసు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి నష్టపోతున్నారు. ప్రమాదం అని తెలిసినా ఆటోల్లో కిక్కిరిసి గమ్యం చేరుకుంటున్నారు. ఇర్విన్ నుంచి మాల్‌కు వెళ్లే బస్సులు ప్రధాన రహదారిపై ఉన్న గ్రామాలకు తప్ప, మారుమూల పల్లెలకు రావడం లేదని, ఈ విద్యా సంవత్సరం నుంచి బస్సులు తిప్పడం లేదని ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫలితంగా సర్కారు బడులకు విద్యార్థుల పెరగడం మాట ఎలా ఉన్నా.. కొరవడిన రవాణ సౌకర్యంతో నానాటికీ వారి సంఖ్య తగ్గిపోతోంది. రవాణా సౌకర్యం గురించి ఆర్టీసీ ఉన్నతాధికారులకు వివరణకోరగా.. రద్దీ ప్రాంతాలకు అదనపు ట్రిప్పులు తిప్పుతున్నామని పేర్కొంటున్నారు.

పట్టించుకోవడం లేదు



బడి వేళలకు ఆర్టీసీ బస్సు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయాన్ని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోవటం లేదు. అధికారులు స్పందించి రవాణా సౌకర్యం కల్పించాలి.

– పర్వతాలు, ఇర్విన్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

రైతులకోసం పనిచేయడం సంతోషంగా ఉంది

ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత



ఏడీఏలు సుధారాణి, సుజాతలను సన్మానిస్తున్న ఎరువుల దుకాణాల యజమానులు

మహేశ్వరం: మహేశ్వరంలో ఏడీఏగా పని చేయడం సంతోషానిచ్చిందని ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత పేర్కొన్నారు. శుక్రవారం మహేశ్వరంలో వత్తుల రఘుపతి కాంప్లెక్స్‌లో ఏడీఏ సుజాత ఆత్మీయ వీడ్కోలు, సన్మాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమన్నారు. ఉద్యోగిగా ఎక్కడ పని చేసినా ప్రజా సేవకోసమేనన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించి, అర్హులైన వారికి రైతు భరోసా, రైతు బంధు, రైతు బీమాతో పాటు సకాలంలో ఎరువులు, విత్తనాలను అందించామన్నారు. అంతకు ముందు మహేశ్వరం నూతన ఏడీఏగా బాధ్యతలు స్వీకరించిన సుధారాణికి సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఏడీఏ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏడీఏలను మండల ఫెర్టిలైజర్స్ యజమానులు, రైతులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఓ నాగమణి, ఏఈఓలు, ఎరువుల దుకాణాల యజమానులు మాధవరెడ్డి, కృష్ణగుప్తా, వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లేష్, మహేందర్, శ్రీకాంత్, రాఘవేందర్ గౌడ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

యాచారం: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. మండల పరిధి నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న నాటి బాల్య మిత్రులు.. శుక్రవారం పాఠశాల వేదికగా సందడి చేశారు. జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ ఆటపాటలతో కేరింతలు కొట్టారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఆమనగల్లు: జిల్లా పరిషత్ నుంచి మంజూరైన రూ.4 లక్షల నిధులతో సీసీరోడ్డును నిర్మిస్తున్నట్లు మాజీ సర్పంచ్ శ్రీనునాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధి రాంనుంతల గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సరిత పంతునాయక్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖర్, నాయకులు హమ్లానాయక్, యాదయ్య, వినోద్‌కుమార్, దాసునాయక్, గోపాల్‌నాయక్, పీఆర్ ఏఈ అభిషేక్, గ్రామ కార్యదర్శి బాలమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనునాయక్